క్లుప్తంగా

ఘనంగా పరిదేశమ్మ పండగ



పరిదేశమ్మ అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

మాకవరపాలెం: పరిదేశమ్మ పండగను బూరుగుపాలెంలో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే గ్రామ శివారులో ఉన్న ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పండగ సందర్భంగా గ్రామంలో భారీ విద్యుత్ దీపాలంకరణతో పాటు రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. పండగలో ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీనల్లకొండమ్మ తల్లి గిరిప్రదక్షిణ



శ్రీనల్లకొండమ్మ తల్లి గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

నాతవరం: మండలంలో తాండవ రిజర్వాయర్ గట్టు దిగువన ఉన్న శ్రీనల్లకొండమ్మ తల్లి ఆలయం చుట్టూ ఆదివారం భక్తులు గిరి ప్రదక్షిణ చేశారు. ప్రతి ఏటా ఫిబ్రవరిలో వచ్చే గురు పౌర్ణమి రోజున అమ్మవారికి గిరి ప్రదక్షిణ చేస్తామని ఆలయ ధర్మకర్త కూనిశెట్టి జోగిరాజు తెలిపారు. సుమారు ఏడు కిలోమీటర్ల దూరం భక్తులు ఆదివారం ఉదయం నుంచి ప్రదక్షిణ చేశారన్నారు. ముందుగా శ్రీనల్లకొండమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో ఉన్న వినాయకుడు, ఆంజనేయస్వామి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి భక్తులు గిరి ప్రదక్షిణ చేపట్టారు. మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ రజాక్, పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

'దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి'

మాకవరపాలెం: దళితులపై దాడిచేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని దళిత ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. గత నెల 16న మండలంలోని జి.నగరంలో బీసీ, దళితుల మధ్య కొట్లాట జరిగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో దళితులపై దాడి చేసిన ఇద్దరినే అరెస్టు చేశారని, మిగిలిన వారిని కూడా అరెస్టు చేయాలని దళిత నేతలు సత్యనారాయణ, చిరంజీవి, చలపతి ఆదివారం డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

వైభవంగా అడవిరాజుల బాబు విగ్రహ ప్రతిష్ట



అడవిరాజులబాబుకు పూజలు చేస్తున్న భక్తులు

మాకవరపాలెం: అడవిరాజులబాబు విగ్రహ ప్రతిష్ట వైభవంగా జరిగింది. మండలంలోని కొండల అగ్రహారంలో కొత్తగా నిర్మించిన ఆలయంలో ఆదివారం అడవిరాజులబాబు విగ్రహాలను సర్పంచ్ పోలిరెడ్డి అచ్చియ్యమ్మ దంపతులు ప్రతిష్టించారు. అనంతరం గ్రామస్థులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు



బుచ్చింపేటలో ఏర్పాటైన గౌరీపరమేశ్వరులు

రోలుగుంట: గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు బుచ్చింపేట, కె.నాయుడుపాలెం గ్రామాల్లో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉత్సవ స్థలంలో మట్టితో ప్రత్యేకంగా తయారు చేసిన శ్రీ గౌరీపరమేశ్వరుల విగ్రహాలను భక్తుల సందర్శనార్థం పల్లకిలో ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో ఉత్సవమూర్తులను దర్శించుకుని పూజలు చేశారు. సోమవారం ఉత్సవమూర్తుల అనుపోత్సవంతో వేడుకలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

ఎన్. గజపతినగరం గ్రామాన్ని అభివృద్ధి చేస్తా

డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: ఎన్. గజపతినగరం గ్రామాన్ని తన స్వగ్రామం తారువతో సమానంగా అభివృద్ధి చేస్తానని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. వేచలం సచివాలయ పరిధిలోని ఎన్.గజపతినగరం, వడ్రపాలెం గ్రామాల్లో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆదివారం ఆయన పాల్గొన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామానికి విచ్చేసిన డిప్యూటీ సీఎంకు మహిళలు హారతులు పట్టి, ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. స్థానిక ఎంపీపీ స్కూల్‌ను సందర్శించి విద్యాభివృద్ధికి పథకాలను ఎవరు అందిస్తున్నారని ఆరా తీయగా 'మా జగన్ మామయ్య' అని విద్యార్థులు బదులిచ్చారు. విద్యార్థులు అనర్గళంగా ఆంగ్లంలో మాట్లాడటం చూసి డిప్యూటీ ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ 65వ వార్డు కార్పొరేటర్, విప్ బొడ్డు నర్సింహపాత్రుడు (కేబుల్ మూర్తి), జెడ్పీ స్త్రీశిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ చైర్మన్ ఈర్లె అనురాధ, స్థానిక జెడ్పీటీసీ కర్రి సత్యం, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబూరావు, వైస్ ఎంపీపీ ఉగ్రాకుల గంగాభవానీ, వైఎస్సార్ టీచర్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు చిరికి శ్రీనివాసరావు, స్థానిక సర్పంచ్ చిరికి లక్ష్మి, ఎంపీటీసీ రెడ్డి శ్రీలక్ష్మి, సచివాలయ కన్వీనర్ చిరికి జగ్గు నాయుడు, ఉప సర్పంచ్ కుంది రాము తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌జీ నగరం ఎంపీపీ స్కూల్లో ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడిన విద్యార్థినిని ఎత్తుకొని అభినందిస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు



ఎన్‌జీనగరంలో మహానేత రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న బూడి

సంక్షేమానికి నిదర్శనం మహానేత వైఎస్సార్

దేవరాపల్లి: మహానేత రాజశేఖరరెడ్డి సంక్షేమానికి నిలువెత్తు నిదర్శనమని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. ఆదివారం మహానేత రాజశేఖరరెడ్డి నూతన విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించి ఘనంగా నివాళులు అర్పించారు. 2002లో మహానేత పాదయాత్రలో ఎన్‌జీ నగరంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారని, ఆ రోజు గ్రామంలో మధ్యాహ్నం విశ్రాంతి తీసుకున్నారని తెలిపారు. ఆ సమయంలో తాను జెడ్పీటీసీ హోదాలో మహానేత వెంట నడిచానని గుర్తు చేసుకున్నారు. అదే విధంగా ఎన్‌జీ నగరానికి చెందిన జీవీఎంసీ 65వ వార్డు కార్పొరేటర్, విప్ బొడ్డు నర్సింహపాత్రుడు (కేబుల్ మూర్తి)ని, పలువురు రిటైర్డ్ ఉద్యోగులను డిప్యూటీ సిఎం ఘనంగా సత్కరించారు.

రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు



తాండవ హైస్కూల్లో నాడు నేడు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్

నాతవరం : రాజకీయాలకు అతీతంగా, అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ అన్నారు. మండలంలో పొట్టినాగన్నదొరపాలెం, తాండవ గ్రామాల్లో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. సీఎం జగన్ 98 శాతం హామీలు అమలు చేశారన్నారు. పొట్టినాగన్నదొరపాలెం, తాండవ గ్రామాలను వైస్ ఎంపీపీ మైనం శ్రీనాగగోపి ఆధ్వర్యంలో అభివృద్ధి చేస్తానన్నారు. పంచాయతీ అభివృద్ధికి అదనంగా రూ. 20 లక్షలు మంజూరు చేస్తానన్నారు. అనంతరం తాండవ హైస్కూల్లో నాడు నేడు పథకంలో రెండవ విడత కింద రూ. కోటి 87 లక్షల అంచనా పనులకు శంకుస్థాపన చేశారు. వైస్ ఎంపీపీ మైనం శ్రీనాగగోపి, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ రజాక్, పార్టీ మండల అధ్యక్షుడు పైల పోతురాజు, కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ శిరుసుపల్లి నర్సింగరావు, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా కమిటీ సభ్యుడు కాపారపు రమణ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహా నేత వైఎస్సార్ విగ్రహావిష్కరణ



వైఎస్ విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్

మాకవరపాలెం: దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ అన్నారు. మండలంలోని కొండల అగ్రహారంలో ఏర్పాటు చేసిన వైఎస్ విగ్రహాన్ని ఆదివారం ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి ఆయన చేసిన మేలు మర్చిపోలేమన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రుత్తల శ్రీనివాస్, నాయకులు పెట్ల భద్రాచలం, చిటికెల రమణ, పోలిరెడ్డి రమణ, సర్పంచ్ అచ్చియ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాములవారి ఆలయ నిర్మాణానికి భూమిపూజ

దేవరాపల్లి: మండలంలోని వెంకటరాజుపురంలో సీతారాముల ఆలయ నిర్మాణానికి ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ఆదివారం భూమి పూజ చేశారు. స్థానిక గ్రామ సర్పంచ్ దాసరి సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామస్తులంతా సీతారాముల నూతన ఆలయ నిర్మాణానికి సంకల్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, కొప్పల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ వరదపురెడ్డి సింహాచలం నాయుడు, లెక్కల ఎర్రినాయుడు, పెనగంటి కళ్యాణం, మాజీ సర్పంచ్ దాసరి రాజునాయుడు, ఉప సర్పంచ్ గట్రెడ్డి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



సీతారాముల ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

ఘనంగా మోదకొండమ్మ తీర్థం



అమ్మవారికి పూజలు చేస్తున్న సర్పంచ్ సంజీవరావు దంపతులు

మాడుగుల రూరల్: మండలంలో ఎం. కోడూరు గ్రామంలో మోదకొండమ్మ తీర్థం ఆదివారం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు దంపతులు అమ్మవారిని దర్శించుకుని, పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయం వద్ద పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పడాల అప్పలనాయుడు దంపతుల సహకారంతో భారీ స్థాయిలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎడ్ల పందాలు, రేస్ గుర్రాల పోటీలు, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

పెదమదీనలో ఘనంగా పరదేశమ్మ విగ్రహ ప్రతిష్ట



పెదమదీనలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట : మండలంలోని పెదమదీన గ్రామంలో పరదేశమ్మ, భూలోకమ్మ, ముత్యాలమ్మ, పోతురాజబాబుల విగ్రహ ప్రతిష్టను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ నెల 4 నుండి 7 వరకు ఈ కార్యక్రమాలు జరగనున్నాయి. ఆదివారం ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన చేపట్టారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, అనకాపల్లి ఎంపీ బీవీ సత్యవతి, మండల పార్టీ అధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, జెడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు, డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, సర్పంచ్ కె. వెంకటరావు తదితరులు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. సోమవారం పసుపు, కుంకుమ పూజలు, సారె ఊరేగింపు నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

ఏడు కేంద్రాల్లో జాతీయ ఉపకార వేతన పరీక్ష



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈవో ప్రేమ్‌కుమార్

నర్సీపట్నం: జాతీయ ఉపకార వేతన పరీక్ష నర్సీపట్నంలో ఏడు కేంద్రాల్లో జరిగింది. ఈ పరీక్షకు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 1510 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షను డిప్యూటీ డీఈవో ప్రేమ్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదివే విద్యార్థులకు ప్రభుత్వం పరీక్ష నిర్వహిస్తుందన్నారు. మెరిట్ స్కాలర్‌షిప్ ఏడాదికి రూ.12 వేలు ఇస్తుందన్నారు. దీనికి గాను ప్రతి ఏటా అర్హత పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హత సాధించిన విద్యార్థులకు నాలుగేళ్ల పాటు ఏడాదికి రూ.12 వేలు చొప్పున కేంద్ర ప్రభుత్వం ఉపకార వేతనం అందిస్తుందన్నారు.

రోలుగుంటలో జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు

రోలుగుంట: ఇటీవల రేవుపోలవరం సముద్ర ప్రమాదంలో మరణించిన సుర్ల జశ్వంత్ కుమార్ జ్ఞాపకార్థం అతని మిత్రమండలి ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. విశాఖపట్నం, మాకవరపాలెం, చోడవరం, రావికమతం, రోలుగుంట, నర్సీపట్నం తదితర ప్రాంతాల నుంచి సుమారు 50 బృందాలు పోటీల్లో పాల్గొననున్నాయని కమిటీ తెలిపింది. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ. 18,000, ద్వితీయ రూ. 12,000, తృతీయ రూ. 8,000, నాల్గవ బహుమతిగా రూ. 4,000 ముగింపు రోజైన 7వ తేదీన ముఖ్య అతిథుల చేతుల మీదుగా ఇస్తామన్నారు. ఈ నెల 8 నుంచి జరగనున్న శ్రీ గౌరీపరమేశ్వరుల ఉత్సవాల సందర్భంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు వారు వివరించారు.



కొమరవోలు వెళ్లే రహదారి పక్కన ఏర్పాటు చేసిన కబడ్డీ కోర్ట్

గిరిజన గ్రామాల్లో ప్రైవేట్ క్రషర్ల ఏర్పాటు



సాగరం వద్ద ప్రైవేట్ క్రషర్‌లో బెల్లం దిమ్మలు తయారు చేస్తున్న దృశ్యం



జాలంపల్లి ప్రైవేట్ క్రషర్‌లో పాకం మరగబెడుతున్న దృశ్యం

మాడుగుల రూరల్: మండలంలో పలు చోట్ల ప్రైవేట్ క్రషర్లు ఏర్పాటయ్యాయి. తూర్పు గోదావరి తదితర ప్రాంతాల నుంచి యజమానులు ఈ ప్రాంతంలో డిసెంబర్ నుంచి ఏప్రిల్ వరకు రైతుల నుంచి చెరకు కొనుగోలు చేసి బెల్లం తయారు చేసి మార్కెట్‌లో విక్రయిస్తారు. అరకిలో బెల్లం రూ. 50కి విక్రయిస్తున్నారు. తూర్పు గోదావరి జిల్లాలో వేర్వేరు ప్రాంతాలైన దివి, యర్రవరం, కాకినాడ వంటి ప్రాంతాలకు వీటిని తరలిస్తున్నారు. మండలంలో సాగరం, సాగరం కాలనీ, సురవరం, జాలంపల్లి, ఎల్. పొన్నవోలు, గాదిరాయి, చీడికాడ వంటి చోట్ల ప్రైవేట్ క్రషర్లు ఏర్పాటు చేశారు. గత నెల నుంచి ఇవి పని చేస్తున్నాయి. కిర్లంపూడి, ఎర్రవరం తదితర ప్రాంతాల వ్యాపారులు వీటిని కొనుగోలు చేస్తున్నారు. ఈ క్రషర్ల వల్ల గోవాడ షుగర్స్ పరిధిలో గల చెరకు కాటాలకు చెరకు సరఫరా కాలేదు. ప్రైవేట్ క్రషర్లకి విక్రయిస్తే చెరకు సరఫరా చేసిన వెంటనే పేమెంట్లు చెల్లిస్తుండడంతో చెరకు రైతులు వీరికి ఇవ్వడానికే ఆసక్తి చూపుతున్నారు.

మండల స్థాయి భజన పోటీలు

రోలుగుంట: మండలం కె.నాయుడుపాలెం గ్రామంలో నర్సీపట్నం, రోలుగుంట మండలాల స్థాయిలో భజన పోటీలను సమరసిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. సర్పంచ్ గుములూరి బాబులు ప్రారంభించిన ఈ పోటీల్లో రెండు మండలాల నుంచి 12 బృందాలు పాల్గొని భభక్తి కీర్తనలతో ప్రతిభ చూపాయి. సోమవారం విజేతలకు బహుమతులు అందజేస్తామని ఫౌండేషన్ ప్రతినిధులు గుములూరి సత్తిబాబు, మలసాల వెంకట రమణ, బణికెల దేముడు తెలిపారు.

పూతదశకు కంది పంట

కె.కోటపాడు : మెట్ట ప్రాంత గ్రామాల్లో గల రైతులు రబీ సాగులో కంది పంటను విస్తారంగా సాగు చేస్తున్నారు. వరి పంట సాగు చేసిన పొలాల్లో రైతులు దుక్కులు నిర్వహించి కంది పంట వేశారు. 70 రోజుల్లో కోత దశకు వచ్చే కంది పంట సాగు లాభదాయకంగా ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. మండలంలో రొంగలినాయుడుపాలెం, మేడిచర్ల, కొరువాడ, పోతనవలస, డి.అగ్రహారం, గవరపాలెం, కేజే పురం, ఆర్‌వై అగ్రహారం గ్రామాల్లో 200 ఎకరాల్లో కంది పంట సాగులో ఉంది. ప్రస్తుతం ఇది పూతదశకు చేరుకోవడంతో మరో 15 రోజుల్లో పంట కోత దశకు చేరుకుంటుందని రైతులు చెబుతున్నారు.



గవరపాలెంలో పూతదశలో ఉన్న కంది పంట

గడప గడపలో చక్కటి స్పందన

రావికమతం: కొత్తకోటలో రెండో రోజు జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి చక్కటి స్పందన లభించింది. తమకు ప్రభుత్వ పథకాలన్నీ అందుతున్నాయని ప్రజలంతా ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీకి చిరునవ్వుతో తెలిపారు. అలాగే సమస్యలపై ఆయనకు కొందరు ఫిర్యాదు చేశారు. శ్మశాన వాటికకు షెల్టర్ నిర్మించాలని, శీలం వీధి, గుమ్ముడు వీధితో పాటు కుంచా మహాలక్ష్మి ఇంటి నుంచి వెదురుపర్తి బ్రహ్మాజీ ఇంటి వరకూ పొడైన డ్రైనేజీలను బాగు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పైల రాజు, చోడవరం నియోజకవర్గ సీనియర్ నాయకుడు శీలం గోవిందరావు, వైస్ ఎంపీపీ దంట్ల వెంకటరమణ, భవానీప్రసాద్, డీసీఎంఎస్ డైరెక్టర్ సత్యదేవ, కొత్తకోట ఉప సర్పంచ్ పందల దేవ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కొత్తకోట శీలం వీధిలో మహిళ ద్వారా సమస్యలు వింటున్న విప్ ధర్మశ్రీ

పరిదేశమ్మ పండగ గోడపత్రిక ఆవిష్కరణ

చోడవరం రూరల్: గోవాడ గ్రామంలో వెలసిన పరిదేశమ్మ అమ్మవారి పండగ ప్రచార గోడపత్రికను ఆదివారం అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా చోడవరం మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక వెంకట సత్యారావు మాట్లాడుతూ ఈ నెల 7 మంగళవారం తెల్లవారు జాము నుంచి అమ్మవారి ప్రత్యేక పూజలు నిర్వహించి, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అదే విధంగా మండలంలోని బెన్నవోలు గ్రామంలో పరిదేశమ్మ అమ్మవారి పండగ సందర్భంగా జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్టు గ్రామ సర్పంచ్ మూడెడ్ల శంకరరావు తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే పోటీల్లో పాల్గొనదలచిన వారు రూ. వంద నామినేషన్ ఫీజు చెల్లించి తమ జట్టు పేరు నమోదు చేసుకోవాలన్నారు.



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఎంసీసీ చైర్మన్ ఏడువాక

సందడి చేసిన పూర్వ విద్యార్థులు

మాడుగుల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1996–97 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు సిల్వర్ జూబ్లీ సందర్భంగా ఆదివారం ఉబ్బలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో గల టేకు తోటలో కలుసుకున్నారు. యడ్ల హేమంత్‌కుమార్, కుక్కర శ్రీధర్, పుట్టా శేషు, భమిడిపాటి గిరి తదితరుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాటి గురువులు రామ్మోహన్‌రావు, బాబి మాస్టార్లను సన్మానించి, సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని పాఠశాలలో ప్రారంభించారు. బెంగళూరు, హైదరాబాద్, చెన్నై, విశాఖపట్నం తదితర ప్రాంతాల్లో స్థిరపడిన సుమారు 60 మంది పాత జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. పాలకుర్తి వరలక్ష్మి, శ్రీనాథు శాంతి, వీఆర్‌వో మోసూరి రాము, సీతా సతీష్ మాస్టారు, శ్రీనాథు కోటి మాస్టారు, జి. రమేష్, కోట్ని భీమునాయుడు తదితరులు పాల్గొన్నారు.



మాడుగుల హైస్కూల్లో నేతాజీ విగ్రహాన్ని ప్రారంభిస్తున్న పూర్వ విద్యార్థులు

యూజేఎఫ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

పాయకరావుపేట ; ఉచిత వైద్య శిబిరాన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్ అన్నారు. పట్టణంలో గల పాండురంగ దేవస్థానం కల్యాణ మండపంలో ఉత్తరాంధ్ర జర్నలిస్టు ఫ్రంట్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. యు.జె.ఎఫ్. జిల్లా కార్యవర్గ సభ్యులు తుమ్మలపల్లి కుమార్, నియోజకవర్గ అధ్యక్షులు మానివెలితి వెంకట్‌లు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా యుజెఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.ఆర్.ఎన్. వర్మ, జెడ్పీటీసీ లంక సూరిబాబు, మాజీ ఎమ్మెల్యే చెంగల వెంకట్రావు హాజరయ్యారు. విశాఖపట్నానికి చెందిన కార్డియాలజిస్ట్ జి.పాల్‌కిరణ్ బృందం రోగులకు హృద్రోగ పరీక్షలు నిర్వహించారు. పట్టణంలో గల హైమా నేత్రాలయ వైద్యులు పిఎస్‌ఆర్ ప్రసాద్ కంటి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వేమగిరి లక్ష్మణ్, ఎంఎంసి వైస్ చైర్మన్ గూటూరు శ్రీను, జగతా శ్రీను, కేశనకుర్తి సత్తిబాబు, యుజెఎఫ్ ప్రతినిధులు ఎం .వెంకట్, టి.కుమార్ లు పాల్గొన్నారు.



ఉచిత వైద్య శిబిరంలో పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది

జనరాజ్‌దాస్ ఆశయ సాధనకు పాటుపడాలి

మునగపాక : మునగపాక గ్రామాభివృద్ధికి నిరంతరం శ్రమించిన జనరాజ్‌దాస్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని గ్రామీణ యువజన సాంస్కృతిక సంస్థ కన్వీనర్ సూరిశెట్టి రాము కోరారు. గ్రామీణ యువజన మందిరం వద్ద ఆదివారం ఆర్ఈసీఎస్ మాజీ చైర్మన్ స్వర్గీయ పెంటకోట జనరాజ్‌దాస్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. జనరాజ్‌దాస్ చిత్రపటం వద్ద పలువురు నాయకులు, కళాకారులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ విద్యుత్ సబ్‌స్టేషన్, ప్రభుత్వ ఆస్పత్రి, పీఏసీఎస్ భవనం ఏర్పాటుకు జనరాజ్‌దాస్ ఎంతో కృషి చేశారన్నారు. కళాకారులను ప్రోత్సహించడంతో పాటు ఆర్ఈసీఎస్ చైర్మన్‌గా పనిచేసిన కాలంలో వినియోగదారులకు మెరుగైన సేవలందించారన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు టెక్కలి కొండలరావు, దాడి మునిలినాయుడు, కళాకారుడు కాండ్రేగుల జగ్గారావు, పాలసంఘ అధ్యక్షుడు మళ్ల సంజీవరావు, జనరాజ్‌దాస్ సోదరుడు శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్ఈసీఎస్ మాజీ చైర్మన్ జనరాజ్‌దాస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ఘనంగా మాఘ పౌర్ణమి పూజలు



పౌర్ణమి పూజల్లో పాల్గొన్న భక్తులు



గురుదేవుల చెవిలో కోరికలు చెబుతున్న భక్తులు

నర్సీపట్నం:మున్సిపాలిటీ బలిఘట్ట ఉత్తరవాహిని పాకలపాడు గురుదేవుల ఆశ్రమంలో మాఘ పౌర్ణమి పూజలు ఘనంగా జరిగాయి. ప్రతి పౌర్ణమికి గురుదేవుల ఆశ్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఎంతో విశిష్టత కలిగిన మాఘ పౌర్ణమి పూజలకు అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. పౌర్ణమి పూజల్లో నవగ్రహ పూజలు జరిపించుకోవటం ద్వారా శుభం కలుగుతుందని భక్తుల విశ్వాసం. అనుకున్న కోరికలు గురుదేవుల చెవిలో చెబితే కచ్చితంగా నెరవేరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. దీంతో అధిక సంఖ్యలో భక్తులు ఆశ్రమానికి విచ్చేసి గురుదేవుల సన్నిధిలో ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. ఆశ్రమం అంతా ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. పూజల అనంతరం గురుదేవుల ప్రసాదాన్ని భక్తులు స్వీకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆశ్రమం నిర్వాహకులు రమణ మాస్టార్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.